# ఇది కథకాదు పత్తికాయ్!

## పాత్రికేయ

న్యూయార్క్‌లోని ఏంట్రా స్ట్రీట్.

అమెరికాలోని అత్యంత ధనవంతులైన వందమందిలో ఒకడైన డబ్బాసన్ ఇంట్లో ఫోన్ మోగింది.


''హల్లో డబ్బాసన్ హియర్''

''నేస్సార్ మీ పి.ఎ. చిందర్‌వందర్‌ని మాట్లాడ్తున్నా''

''ఏంటో చెప్పేడువ్''

''ఈరోజు సాయంత్రం ఏడు గంటలకు వీరసుత్తి ఎక్స్‌పోర్ట్స్ అండ్ ఇంపోర్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్‌తో మీటింగ్ ఏర్పాటు చేశాను. వాళ్ల కంపెనీకి, మన కంపెనీకి మధ్య ఒప్పందం కుదిరితే మనకు కోటానుకోట్ల డాలర్ల లాభం వస్తుంది సార్''

''ఈరోజు నేను ఏ మీటింగ్‌కీ రాలేను. సాయంత్రం డింబారే గ్రౌండ్స్‌లో మైకు జాక్సన్ డాన్స్ ప్రోగ్రామ్‌కి వెళ్లాలి''



''ఎంత మాటన్నారు సార్! కోటానుకోట్ల డాలర్లకంటే మీకు ఆ మైకు జాక్సన్ డాన్స్ ప్రోగ్రామే ఎక్కువా?''

''షటప్... మైకు జాక్సన్ గురించి ఇంకొక్క మాట మాట్లాడావంటే మర్డరైపోతావ్. మైకు జాక్సన్ డాన్స్ ప్రోగ్రాం చూసేందుకోసం అవసరమైతే నేను నా ఆస్తిమొత్తాన్నీ త్యాగంచేస్తా''

''అబ్బ! మైకు జాక్సన్ అంటే మీకెందుకింత అభిమానం సార్?''

''నాలాంటి వీరాభిమానులు మైకు జాక్సన్‌కు ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ఉన్నారు. వాళ్లంతా ఆయన డాన్స్ ప్రోగ్రాం కోసం దేన్నయినా త్యాగం చేస్తారు తెల్సిందా?''

''ఇంత డీటైల్డ్‌గా చెబితే తెలియక చస్తుందా సార్? వీరసుత్తి ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్స్ ఎండీతో మీటింగ్ కేన్సిల్ చేసేసి, నేనుకూడా మైకు జాక్సన్ ప్రోగ్రాంకి వస్తున్నా సార్''

''గుడ్''

★ ★ ★

మైకు జాక్సన్‌కు ఉన్న మాస ఫాలోయింగ్ ఎలాంటిదో తెలియజేయడానికే పై సీన్ రాయడం జరిగిందే తప్ప, ఈ కహానీకి, పై రెండు వేస్ట్ కేరెక్టర్లకీ ఎలాంటి సంబంధం లేదని మనవి. టైం ఆరున్నర కావస్తోంది. మైకు జాక్సన్ డాన్స్ ప్రోగ్రాం చూసేందుకు ఇప్పుడు మనమంతా ఓవర్ టు డింబారే గ్రౌండ్స్.

★ ★ ★

దాదాపు ఓ కిలోమీటర్ వైశాల్యం ఉన్న డింబారే గ్రౌండ్స్ నిండా జనమే జనం. ఓ గుప్పెడు ఇసుక వాళ్లమీద జల్లితే ఒక్క రేణువు కూడా నేలమీద పడదు... ఒట్టు.

సరిగ్గా ఏడింటింకి మైకు జాక్సన్ డాన్స్ ప్రోగ్రాం ప్రారంభమైంది. గ్రౌండ్‌లో ఉన్న జనం తన్మయత్వంతో చిందులే వేశారో, విరగబడ్డారోగానీ, ఓ మూడు గంటలపాటు అరుపులు, కేరింతలతో డింబారే గ్రౌండ్ దద్దరిల్లిపోయింది.

మైకు జాక్సన్ ప్రోగ్రాం ముగిసిందెహె!

అలసిపోయిన అభిమానులు ఒక్కరొక్కరే ఇంటిముఖం పడ్తున్నారు. వారిలో ఓ ఎనభై ఏళ్ల బామ్మ తనలో తాను ఇలా గొణుక్కుంది.

''డాన్స్ ప్రోగ్రాం మస్తుబహార్... కానీ మైకు జాక్సన్ ముఖంలో ఏదో దిగుల్లాంటిది కనిపిస్తోంది''

మరో ఇర్వై ఏళ్ల పోరి ఉవాచ.

''మైకు జాక్సన్ డాన్స్ ప్రోగ్రాం అంపర్ మే బంపర్... అండ్ సూపర్ డూపర్. కానీ, మైకు జాక్సన్ ముఖంలో ఏదో దిగులు కనిపిస్తోంది''

మరో యంగ్‌గై పర్సనల్ ఫీలింగ్.

''మైకు జాక్సన్ డాన్స్ అంబారే అంబ... బట్ సమ్‌థింగ్ రాంగ్ ఇన్ మైకు జాక్సన్ ఫేస్''

సేమ్ ఇలాంటి డౌటే మైకు జాక్సన్ ఫ్రెండ్స్‌కి కూడా వచ్చింది.

''ఏంట్రా ఎన్నడూ లేనిది నీ ఫేసులో దిగులు కనిపిస్తోంది. నీ బ్లడ్‌లో హెచ్.ఐ.వి. పాజిటివ్ ఉన్నట్టేమైనా తెల్సిందా?'' ఫ్రెండ్సంతా కలిసి మైకు జాక్సన్‌ను ప్రశ్నించారు.

''అదేంకాదు... నాకు కోట్ల డాలర్ల ఆస్తి వుంది. కానీ తొడుక్కోవడానికి నాకో మంచి చొక్కా లేదు. అదే నా దిగుల్కి కారణం'' యమా దిగులుగా అన్నాడు మైకు జాక్సన్.

అందరూ షాకోయమ్మ షాకు... కొందరైతే షేకోయమ్మ షేకు.

''అదేంటి జాక్సన్ మరీ కీతాగా మాట్లాడ్తావ్? నీ దగ్గరున్న పది లక్షల చొక్కాల్లో ఒక్కటి కూడా మంచి చొక్కా లేదా?''

''హు... ఆ చొక్కాలు నా శరీరాన్ని కప్పుతున్నాయిగానీ, నా మనసును కప్పలేకపోతున్నాయి''

''ఛా... అయితే నాల్రోజుల్లో ప్రపంచం నలుమూలల్నుంచి అదిరిపోయే డిజైన్లున్న చొక్కా గుడ్డల్ని తెప్పిస్తాం. వాటిలో నీకు నచ్చిన క్లాత్ సెలెక్ట్ చేసుకుని, నీ మనసును కప్పేలా కుట్టించుకో. ఇక దిగులుపడ్డం ఆపి, మందుకొడదాం...రా!''

''సరే పదండి మందుకు''

★ ★ ★

నాల్రోజుల తర్వాత ఓ ఇర్వై లక్షల చొక్కా గుడ్డలు మైకు జాక్సన్ ఎదుటకు వచ్చాయి. వాటన్నిట్నీ పరీక్షించిన జాక్సన్ నిరాశగా పెదవి విరిచాడు. అది చూసి అతని ఫ్రెండ్స్- ''ఏం నాయనా, ఇన్ని లక్షల చొక్కా గుడ్డల్లో నీకు నచ్చింది ఒక్కటి కూడా లేదా?'' అన్నారు.

''లేదు'' నిరాశగా అన్నాడు జాక్సన్.

''వార్నీ, ఆఫ్రికా అడవుల్లో పుట్టాల్సిన వాడివి టైం బాగుండి అమెరికాలో పుట్టావ్. ఇన్ని గుడ్డలు తెప్పించినా

నీకు నచ్చలేదంటే, ఇక నీ మనసు కప్పడం మా వల్లకాదు. ఇక ఈ విషయంలో మమ్మల్ని వదిలెయ్'' ముక్తకంఠంతో అరిచారు ఫ్రెండ్సంతా.

ప్రాణ స్నేహితులు అంత ఇదిగా మాట్లాడేసరికి బాధగా తల విదిల్చాడు మైకు జాక్సన్. అలా తల విదల్చినప్పుడు మైకు జాక్సన్ దృష్టి అప్రయత్నంగా అక్కడే ఓ మూల ఉన్న చెత్తబుట్ట మీద పడింది.

జాక్సన్ కళ్లలో వెలుగు... 'నాక్కావలసింది... ఆ బుట్టలో వుంది' అనుకుంటూ పరుగు పరుగున చెత్తబుట్ట దగ్గరకు వెళ్లాడు జాక్సన్.



చెత్తబుట్టలో దారుణంగా కుక్కి ఉన్న ఓ కాటన్ క్లాత్‌ని ఆత్రంగా బైటకి లాగాడు జాక్సన్. తెల్లటి క్లాత్ మధ్యలో ఎర్రటి డిజైన్.

''ఆహా! అద్భుతమైన డిజైన్. ఈ ఎర్రటి డిజైన్‌ని గుండె మీద వచ్చేలా చొక్కా కుట్టించుకుంటే నా మనసు నిండుతుంది. ఇంత మంచి కాటన్ క్లాత్‌ని చెత్తబుట్టలో కుక్కిందెవరు?'' మైకు జాక్సన్ ఉవాచ.

''మేమే. మైకు జాక్సన్ లాంటి ఇంటర్నేషనల్ స్టార్ ఆఫ్ట్రాల్ కాటన్ చొక్కా తొడుక్కోవడమా అని మేమే దాన్ని చెత్తబుట్టలో కుక్కాం''

ఏడిశారు. చివరి క్షణంలో నేను చూడబట్టి సరిపోయింది. లేకపోతే నేను జీవితంలో బోల్డంత కోల్పోయేవాడిని. అద్సరేగానీ ఈ కాటన్ క్లాత్‌ని ఏ దేశం నుంచి తెప్పించారు?''

''మేం తెప్పించలేదు. బై మిస్టేక్ ఇండియా నుంచి వచ్చేసింది''

''ఇండియా నుంచా?''

''అవున్రా. ఇండియాలో సుత్తిప్రదేశ్ అనే ఓ దిక్కుమాలిన స్టేట్‌లో ఉన్న 'దివాలా ఖాదీ భండార్' అనే షాప్ నుంచి ఈ క్లాత్ వచ్చింది''

''అయితే అర్జెంటుగా ఇదే డిజైన్ ఉన్న షర్ట్ బిట్లు ఓ లక్ష తెప్పించండి''

''కాటన్ క్లాత్ ఆర్డర్ ఇవ్వడం మాకు పరువునష్టం. అంచేత 040-123456 అనే నంబర్‌కి ఫోన్‌చేసి నువ్వే ఆర్డరిచ్చుకో... మాకు మందు కొట్టడాన్కి టైమైంది, మేం వస్తాం''

★ ★ ★

040-123456

ట్రింగ్... ట్రింగ్...

''హలో దివాలా ఖాదీ భండార్ హియర్''

''హలో... నేను అమెరికా నుంచి ప్రపంచ ప్రఖ్యాత డాన్సర్ మైకు జాక్సన్ని మాట్లాడ్తున్నా...''

''నువ్వెవడివైతే మాకేంటెహె... నీకేంకావాలో చెప్పు''

''ఏంలేదు ఈమధ్య మీ షాపునుంచి ఎర్రటి డిజైన్ ఉన్న కాటన్ క్లాత్ మా దేశానికి వచ్చింది. అలాంటి షర్ట్‌బిట్లు ఓ లక్ష కావాలి''

''లక్ష కావాలంటే ప్రస్తుతం దొరకవ్. మా దగ్గర ప్రస్తుతం రెండు షర్ట్‌బిట్లు మాత్రమే ఉన్నాయ్. ఒక్కో బిట్ ఖరీదు లక్ష డాలర్లు''

''సరే చచ్చినోడి మ్యారేజికి వచ్చిందే డౌరీ. ఎంత ఖరీదైనా పర్లేదు ఆ రెండు బిట్లు వెంటనే నాకు పంపించండి. మళ్లీ రెండ్రోజులాగి ఫోన్‌చేస్తా''

''సర్లే ఫోన్ పెట్టెయ్''

★ ★ ★

040-123456

ట్రింగ్ ట్రింగ్

''హలో దివాలా ఖాదీ భండార్ హియర్''

''నేను మైకు జాక్సన్ని మాట్లాడ్తున్నా. మీరు పంపిన రెండు షర్ట్ బిట్లు అందాయి. డిజైన్లు మస్తుగా ఉన్నాయి. నేను పంపిన రెండు లక్షల డాలర్ల డి.డి. అందిందా?''

''అందింది. అద్సరేగానీ మరో షర్ట్‌బిట్ రెడీ అయింది పంపించనా?''

''అర్జెంటుగా పంపించు. లక్ష డాలర్ల డి.డి. వెంటనే పంపిస్తా. ఫోన్ పెట్టేస్తున్నా''

★ ★ ★

అర్గంటైంది.

098786984747 - 73737747474 (ఇది మైకు జాక్సన్ ఫోన్ నంబరన్నమాట).

ట్రింగ్... ట్రింగ్

''హలో మైకు జాక్సన్ హియర్''

''నేను దివాలా ఖాదీ భండార్ నుంచి మాట్లాడ్తున్నా''

''ఇప్పుడేగా నేను ఫోన్‌చేశాను, ఇంతలో షాపేం మునిగింది?''

''ఏంలేదు, ఇంకో మూడు షర్ట్ బిట్లు రెడీ అవుతున్నాయి. అవికూడా నీకు పంపిస్తున్నాం. మొత్తం నాలుగు లక్షల డాలర్లకి డి.డి. పంపించు''

''తమాషాగా వుందే! అర్గంటలోనే ఇంత అద్భుతం ఎలా జరిగింది?''

''మరదే సుత్తిప్రదేశ్ మహిమంటే! జస్ట్ ఇంతకుముందే ముగ్గురు పత్తిరైతులు ఆత్మహత్య చేసుకున్నారు. దాంతో మరో మూడు కాటన్ షర్ట్ బిట్లు రెడీ చేసేందుకు వీలు కలిగింది''

''పత్తిరైతుల ఆత్మహత్యకి, నా స్పెషల్ డిజైన్ షర్టుబిట్లకి లింకేంటి భై?''

''పత్తిరైతులు ఆత్మహత్య చేసుకున్నప్పుడు వాళ్ల రక్తం పత్తిమీద చిందుతుంది. ఆ పత్తితో క్లాత్ తయారు చేసినప్పుడు రెడ్ కలర్‌తో స్పెషల్ డిజైన్ వస్తుంది''

''అమ్మనీ... స్పెషల్ డిజైన్ వెనుక ఇంత కహానీ వుందా?''

''అవునుమరి. మా స్టేట్‌లో ప్రతిరోజూ పత్తిరైతులు ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉంటారు. ఎంతమంది ఆత్మహత్యలు చేసుకుంటే అన్ని స్పెషల్ డిజైన్ షర్ట్ బిట్లు రెడీ అవుతాయి''

''దారుణం. పత్తి రైతుల ఆత్మహత్యల్ని ఆపడానికి మీ గవర్నమెంట్ చర్యలేవీ తీసుకోవట్లేదా?''

''ఏంట్రా జాక్సన్ ఎక్కువగా మాట్లాడ్తున్నావ్? పత్తిరైతుల ఆత్మహత్యల్ని మా ప్రభుత్వమే లైట్‌గా తీస్కుంది. మధ్యలో నీకేంటంట? మా అంతరంగిక విషయాల్లో జోక్యం చేసుకుంటే స్పెషల్ డిజైన్ క్లాత్ సప్లయ్ ఆపేస్తా జాగ్రత్త''

''షటప్... నువ్వు ఆపేసేదేంటి? పత్తిరైతుల రక్తంతో తడిసిన షర్ట్‌ల్ని నేనే తిరస్కరిస్తున్నా. ఒక్కటిమాత్రం గుర్తుంచుకో. పత్తిరైతుల ఉసురు పోసుకున్న మీ స్టేట్ గవర్నమెంట్ అడ్రస్ లేకుండా పోతుంది జాగ్రత్త''

''చాల్చాల్లే ఫోన్ పెట్టేయెహె'' అని ఫోన్ పెట్టేశాడు దివాలా ఖాదీ భండార్ అధినేత.

మైకు జాక్సన్ కూడా ఫోన్ పెట్టేసి భారంగా నిట్టూర్చాడు. ఒక్కసారి తను వేసుకున్న షర్ట్‌వైపు చూశాడు. అతని చూపు ఎర్రటి డిజైన్ మీద నిలిచింది. జాక్సన్ కళ్లలోంచి రెండంటే రెండు కన్నీటి బిందువులు జారి షర్ట్‌మీద పడి ఇంకిపోయాయి.

పత్తిరైతుల ఆత్మలన్నీ తన చుట్టూ తిరుగుతున్నట్టు అనిపించింది మైకు జాక్సన్‌కి. క్షణం కూడా ఆలస్యం చేయకుండా తను వేసుకున్న షర్ట్ విప్పేసి చెత్తబుట్ట వైపు విసిరేశాడు జాక్సన్.

ఆరోజు నుంచి స్పెషల్ డిజైన్ షర్ట్‌లే కాదు అసలు షర్ట్‌లే వేసుకోవడం మానేశాడు జాక్సన్. ఏ షర్ట్ వెనుక ఏ కన్నీటి గాథ ఉందోనన్న డౌటే దీనికి కారణం.

★